క్లుప్తంగా

విగ్రహాలను మ్యూజియంలో భద్రపరుస్తాం



ఆత్మకూరు: కాకతీయుల కాలంనాటి పురాతన విగ్రహాలను నగరంలోని పురావస్తు శాఖ మ్యూజియంలో భద్రపరుస్తామని పురావస్తుశాఖ ఏడీ మల్లునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని పంచకూట శివాలయం పునర్నిర్మాణం, ప్రతిష్ఠల తర్వాత భిన్నమైన విగ్రహాలను మల్లునాయక్ ఆధ్వర్యంలో మ్యూజియానికి తరలించారు. నాలుగు నందులు, శివలింగం తదితర విగ్రహాలను తరలించారు. ఈ సందర్భంగా మల్లునాయక్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కళలు, చరిత్ర, నైపుణ్యాన్ని అందించడానికి మ్యూజియంలో ఉంచుతామన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ




పరకాల: స్వేరోస్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు పరకాల పట్టణంలో స్వేరోస్ కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు బొచ్చు రాజు, పెండ్యాల రవీందర్, బొచ్చు చిన్ని కృష్ణ మాట్లాడుతూ స్వేరో సంస్థను దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంతో పాటు దేశంలో ఆర్థిక అసమానతలను, సామాజిక కులవర్గ విభేదాలతో ఉన్న ప్రజలందరినీ ఐక్యం చేశారన్నారు. కార్యక్రమంలో స్వేరో కార్యకర్తలు కిరణ్, రాకేష్, నవీన్, అనిల్, రఘువరన్, రమేశ్, భాస్కర్, శివాజీ, కుమార్, శ్రీనివాస్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అంకిత భావంతో పనిచేయాలి



ఆత్మకూరు: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల నిర్వహణకు టార్గెట్లు ఇవ్వడం జరిగిందని నర్సరీల్లో ఈనెల 26 వరకు బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల నిర్వహణకు కృషిచేయాలన్నారు. సర్వే డాటా ఎంట్రీ ప్రారంభమైందని గ్రామాల వారీగా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి, మాందారిపేట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ బోధన తీరును, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కానట్లయితే ముందస్తుగా సెలవు అనుమతి తీసుకోవాలని సూచించారు. గైర్హాజరైన ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో గణిత బోధన తీరు గమనించి పలు సూచనలు చేశారు. డైరీ వినియోగించాలన్నారు. విద్యార్థులు చదవడం, రాయడాన్ని పరిశీలించారు. వర్క్ షీట్ల నిర్వహణ రోజువారీగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ వంశీ ఉన్నారు.

పల్లె ప్రకృతివనాలపై పట్టింపేది..?

- నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిన ప్రకృతివనం

వేలేరు : ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, ప్రతీ మండలానికో బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే మండలంలోని పీచర–షోడాషపల్లి గ్రామాల పరిధిలో సమ్మక్క–సారలమ్మ జాతర జరిగే సమీపంలో సుమారు 4 ఎకరాల్లో బృహత్‌పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలు నాటిన కొత్తలో అధికారులు, గ్రామపంచాయితీ సిబ్బంది సక్రమంగానే నీళ్లు పట్టి కాపాడారు. తర్వాత గత కొన్ని నెలలుగా ఆయా గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను, బృహత్‌పల్లె ప్రకృతి వనం నిర్వహణను సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి కనీసం కూర్చునేందుకు కూడా లేకుండా పోయింది. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలకు, బృహత్ పల్లె ప్రకృతి వనానికి రూ.1 లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. కానీ ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారడంతో పాటు, ప్రజాధనం దుర్వినియోగమైంది. కొన్ని పల్లె ప్రకృతి వనాలు అసాంఘిక కార్యక్రమాలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. అలాగే వాటి నిర్వహణ సరిగాలేక బృహత్‌పల్లె ప్రకృతి వనాన్ని సూచించే బోర్డు కనిపించకుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అలాగే దాని చుట్టూ నాటిన కనీలు విరగొట్టి ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు స్పందించి పల్లెప్రకృతి వనాలు, బృహత్ పల్లె వనంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలను రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బోర్డు కనిపించకుండా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



మందుబాబులు పడేసిన మద్యం బాటిళ్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



పల్లె ప్రకృతి వనాలను ఊరికి చివరన ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. పల్లె ప్రకృతి వనాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల వస్తువులను ఏర్పాటు చేయాలి.

– కీర్తి సురేశ్, సోడాషపల్లి గ్రామస్తుడు

రేపు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్

కమలాపూర్ : ఈ నెల 25న కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతుందని హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తవుటం ఝాన్సీరాణి–రవీందర్, వైస్ చైర్మన్‌గా దేశిని ఐలయ్య, డైరెక్టర్లుగా ఓర్సు తిరుపతి, ఆకినపెల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, వంటకాల అనిల్‌రెడ్డి, సముద్రాల కృష్ణ, మిట్యాకరి శ్రీనివాస్, నిగ్గుల లింగయ్య, ఎండీ.చిన్న యాకూబ్ అలీ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్‌గౌడ్, కెత్తె విజేందర్ ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి

పరకాల: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. శనివారం పరకాలలో జరిగిన డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ పేరిట కోట్లాది రూపాయలు వృథా చేస్తున్న పాలకులు విద్యారంగ వ్యవస్థను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఓర్సు చిరంజీవి, శివశంకర వరప్రసాద్, ఎస్.విజేందర్‌రెడ్డి, ఎస్.సాయిమనోజ్, అంజి, జాషువా, భరత్, సత్యశోధన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కమలాపూర్: మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన మాదాసి సదానందం (50) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. ఈ నెల 18న రాత్రి సదానందం శనిగరంలోని వెంగళ సాంబమూర్తి ఇంటి ఎదుట రోడ్డు పక్కన నిల్చొని ఉండగా ఏపీ 36 ఏసీ 8770 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని నడికూడ మండలం ముస్త్యాలపల్లికి చెందిన రాగల రాజు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి సదానందంను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సదానందంకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు చెప్పారు. మృతుని సోదరుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



పులుకుర్తిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి



శాయంపేట : ఓటరు నమోదును పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ శైలజ

- దామెర తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

దామెర: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని పులుకుర్తి, ల్యాదెల్ల, పసరగొండ, ఊరుగొండ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. స్థానిక పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గతంలో ఓటు హక్కు ఉన్న వారు ఓటరు జాబితాలో తప్పొప్పులను పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట ఆర్ఐలు సంపత్, భాస్కర్ రెడ్డి, మురళి, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

శాయంపేట : 2025 జనవరి 1 వరకు 18 ఏళ్లు నిండిన యువతి యువకులను ఓటరు నమోదు చేయాలని సూపర్‌వైజర్ శైలజ బీఎల్ఓలకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కొత్త ఓటరు నమోదు, ఓటరు సవరణ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తుండగా శనివారం మండల కేంద్రంలోని 305, 306, 308 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌ను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఓటర్ నమోదై ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ఫారం–8 ద్వారా సవరణ చేసుకోవాలని, కొత్త ఓటరు నమోదుకు ఫారం–6 నింపి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, బీఎల్ఓలు రత్నమాల, శ్వేత, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: ఆల్ ది బెస్ట్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక కార్యకర్తలను సేవా నంది, సేవాభూషణ్ జాతీయ పురస్కారాలతో సత్కరించేందుకు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవా కార్యకర్తలు వివిధ విభాగాల్లో అందించిన సేవలకు పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. చేసిన సేవలకు సంబంధించిన వార్త పత్రికల క్లిప్పింగ్‌లు, ఫొటోలతో కూడిన దరఖాస్తులను పరిశీలించి డిసెంబర్ 8న హైదబాద్‌లోని సంస్థ కార్యాలయంలో పురస్కారాలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

విజయోత్సవాలపై కళాకారుల ఆటాపాట



పాటలు పాడుతున్న కళాకారులు

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది సమీపిస్తుండడం, ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంతో ప్రజాపాలన విజయోత్సవాల సంబురాల్లో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కళాయాత్ర చేస్తూ కళాకారులు ఆటాపాటలతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి మైన ఎర్రన్నతో పాటు కళాబృంద సభ్యులు దుప్పటి రవి, మాంకాల యాకూబ్, ఎండీ.ఖలీల్‌పాషా, కొండపర్తి స్వప్న, కంచర్ల శ్యామల, బండారి అనిత, గడ్డం రజితలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై పాటల ద్వారా ప్రజలకు వివరించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: హనుమకొండలోని జేఎస్ఎస్‌లో ఈనెల 22న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో విలియం కేరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ఇన్‌చార్జ్ విద్యాకర్ తెలిపారు. 300 మీటర్లులో నిహాసపటేల్ గోల్డ్‌మెడల్ సాధించగా, 300 మీటర్లలో వైష్ణవి బ్రాంజ్ మెడల్, 600 మీటర్ల అథ్లెటిక్స్‌లో రాహుల్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారని వివరించారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ దేవయ్య, ఫిజికల్ డైరెక్టర్ పోతుల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సునీల్, శ్రీనివాస్ శనివారం అభినందించారు.

డీఎంహెచ్‌ఓ పరామర్శ



రమేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎల్కతుర్తి: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఎల్కతుర్తి పీహెచ్‌సీలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ వకులభరణం రమేశ్ (51) కుటుంబాన్ని హనుమకొండ డీఎంహెచ్‌ఓ ఎ.అప్పయ్య శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి రూ.20 ఆర్థికసాయం అందజేశారు. డీఎంహెచ్‌ఓ వెంట డాక్టర్ హైమ్మద్, డాక్టర్ శ్రీనాథ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పదకొండైనా తెరవని పల్లె దవాఖాన

- సమయపాలన పాటించని అధికారులు
- ఆస్పత్రికి వచ్చి, వెనుదిరిగిన రోగులు



ఉదయం 11 దాటినా తెరవని ఆస్పత్రి గేటు

నడికూడ: మండల పరిధిలో పలు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చర్లపల్లిలోని పల్లె దవాఖాన శనివారం ఉదయం 11 గంటలు అవుతున్నా దవాఖాన గేటు తెరవకపోవడంతో వైద్యం కోసం వచ్చి వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా ఇటీవల స్వయంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చర్లపల్లె పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించినప్పుడు కూడా సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్

- సైకాలజిస్ట్, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

ధర్మసాగర్: విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని సైకాలజిస్ట్, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే విద్యతో పాటు ఉత్తమ వ్యక్తిత్వానికి మూలమైన సంస్కారం, వినయం, విధేయతలు కలిగి ఉండాలని సూచించారు. తమ జీవితాలను విచ్ఛిన్నం చేసే తప్పుడు పోకడలకు, తప్పుడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. అపరిచితులు ఆహ్వానిస్తే బైక్ ఎక్కడం, తినుబండారాలు తీసుకోవడం లాంటివి చేయకూడదని అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగకుండా మనోధైర్యంతో ఉండాలని, తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా జీవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళి అధ్యక్షత వహించగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, కార్యవర్గసభ్యులు లక్ష్మీనారాయణ, పెంచాల స్వామి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



పరకాల పట్టణంలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న బీజేపీ నాయకులు

- బీజేపీ నేతలు ధీమా
- మహారాష్ట్రలో గెలుపుతో పార్టీ శేణుల సంబురాలు

పరకాల: భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకే పట్టం కట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ భారీ మెజార్టీ సాధించినందుకు పరకాలలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో బాణసంచాకాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించిన మహారాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్స్ ఆర్‌పీ జయంత్‌లాల్, బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, పరకాల పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు గురుప్రసాద్, రాజిరెడ్డి, దేవేందర్, రాజభద్రయ్య, సతీష్‌కుమార్, పురుషోత్తం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కమలాపూర్ : పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు



ఐనవోలు: నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్సై శ్రీనివాస్

- ముగ్గురిపై కేసు, ఇద్దరి అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన మాట్ల అశోక్, మాట్ల రమేశ్, పోలు రమేష్ కలిసి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసులను గమనించి పారిపోతున్న అశోక్, రమేశ్‌లను రైల్వేస్టేషన్ బయట అదుపులోకి తీసుకున్నామని, పోలు రమేశ్ పరారైనట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి మాట్ల అశోక్, మాట్ల రమేశ్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు..

ఐనవోలు : మండలం కేంద్రంలో పాటు పున్నేలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో సుమారు రూ.10వేల విలువ చేసే నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు పలు దుకాణాల్లో అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కాగా రూ.10 వేల విలువ గల గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని మాడిశెట్టి సోమేశ్వర్‌రావు, బొల్లపెల్లి రమేశ్, పులి మంజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.